క్లుప్తంగా

పోలీసుల ముమ్మర తనిఖీలు



ఆర్టీసీ పార్శిల్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ యుగంధర్

ఆళ్లగడ్డ: భారత్ – పాకిస్తాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ ఆదేశాల మేరకు ఆదివారం సీఐ యుగంధర్, ఎస్‌ఐ జయప్ప ఆధ్వర్యంలో పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బస్టాండులోని ఆర్టీసీ పార్శిల్ సర్వీస్ కార్యాలయంలో ఉన్న పార్శిళ్లను, బస్‌లోని ప్రయాణికుల బ్యాగులను, సామాన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అనుమానితులు, అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు కనిపించిన వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

గురురాజ పాఠశాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీగురు రాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాల పోస్టర్‌ను ఆదివారం ఏపీ రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆవిష్కరించారు. ఆ విద్యా సంస్థ డైరెక్టర్ శేఖావలిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రిమాట్లాడుతూ పాఠశాల విద్యార్థి 597 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బి.కోడూరులో కార్డెన్ సెర్చ్

బండి ఆత్మకూరు: మండలంలోని బి.కోడూరు గ్రామంలో ఆదివారం పోలీసులు నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో 10 లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున గ్రామంలోని అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేపట్టామని, ఈ క్రమంలో పాములేటి అనే వ్యక్తి దగ్గర 10 క్వార్టర్ల మద్యం బాటిళ్లు, సరైన ధ్రువ పత్రాలు లేని 6 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించి ఎలాంటి గొడవలు ,అల్లర్ల జోలికి వెళ్లకుండా శాంతియుతంగా జీవించాలని సూచించారు. మహానంది ఎస్‌ఐ రామ్మోహన్, గోస్పాడు ఎస్‌ఐ వెంకటప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

ఆత్మకూరు: కర్నూలు–గుంటూరు జాతీయ రహదారిలోని శ్రీశైలం వైపు ఉన్న రైస్‌మిల్ వద్ద బస్సు, కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు.. గుంటూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో కర్నూలుకు వస్తుండగా కర్నూలు నుంచి శ్రీశైలంకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు పట్టణ శివారులోని రైస్‌మిల్ వద్ద ఢీకొన్నాయి. అయితే రెండు వాహనాలు నెమ్మదిగా వెళ్తుండటంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గుంటూరుకు చెందిన కారు డ్రైవర్ నిద్రమత్తులో ఉండి బస్సును తాకి వేపచెట్టును ఢీకొట్టింది. దీంతో కారులోని ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగ్రాతులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ శంకర్‌రెడ్డి తెలిపారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

జూపాడుబంగ్లా: కార్మికుల అభివృద్ధికి ఆటంకంగా ఉన్న నాలుగు లేబర్‌కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు గోపాలకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పక్కీర్ సాహెబ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేటు పరం చేస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలుచేయాలని డిమాండ్‌చేశారు. కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మెలో కార్మికులు భారీసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కర్ణ, ఆకుల రాము, సిలార్‌బాషా, విజయ్, ఆటో కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

ఆత్మకూరు: రాష్ట్రవ్యాప్తంగా కారుణ్య నియామకాల్లో జాప్యం వల్ల చనిపోయిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జవహర్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు ప్రభుత్వం కారుణ్య నియామకం కింద ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలు కుటుంబాలు ఉపాధిలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. 12వ పీఆర్‌సీ ఇప్పటికే 22 నెలలు ఆలస్యమైందని, వెంటనే కమిటీ ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు.



రాయమాల్పురంలో పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు



నందమూరినగర్ నుంచి పట్టణానికి వెళ్లే రోడ్డుపై వాహనదారుల అవస్థలు

దారులన్నీ ఇంతే!

రహదారులు అధ్వానంగా మారాయి. ఏ ఊరి రోడ్డు చూసినా అడుగడుగునా గుంతలే. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం బారిన పడాల్సి వస్తుంది. దీంతో వాహనదారులు రాత్రిపూట రోడ్లపై వెళ్లాలంటే ఏ గుంతలో పడతామోనని భయపడుతున్నారు. నంద్యాల మండలంలోని పల్లె రోడ్లే కాదు పట్టణంలోని పలు దారుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. నందమూరినగర్, ఎస్‌బీఐ కాలనీ, బొమ్మలసత్రం, పీవీనగర్, అరుంధతినగర్, నూనెపల్లెతో పాటు మండలంలోని పెద్దకొట్టాల, చాబోలు, భీమవరం, పులిమద్ది, పోలూరు, తదితర గ్రామాల రహదారులు మరి దారుణంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలిచిపోయి బురదమయంగా మారుతున్నాయి. ఎన్నికల ముందు గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా రోడ్ల అభివృద్ధి కాదు కదా కనీసం మరమ్మతులు కూడా చేపట్ట లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న వర్షాకాలంలో తాము తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తుందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. –నంద్యాల (అర్బన్)



గుంతలమయంగా చాబోలు రోడ్డు

వీర జవాన్‌కు జోహార్లు



మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న శంకర్‌నాయక్, తదితరులు



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(అర్బన్): యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ బిలావత్ శంకర్‌నాయక్, మాజీ కౌన్సిలర్ అమృతరాజ్, ఆల్ ఇండియా బంజార సేవాసంఘం ప్రెసిడెంట్ బాలానాయక్, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు సుంకన్న, రిటైర్డు రైల్వే ఉద్యోగి నారాయణ, హత్తినాయక్, రాజునాయక్ పాల్గొని మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పోషిస్తున్న పాకిస్తాన్‌కు కోలుకోకుండా దెబ్బతీయాలన్నారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన జవాన్ కుటుంబానికి దేశమంతా అండగా నిలవాలన్నారు.

గోస్పాడు: సైనికుడు మురళీనాయక్ మరణం బాధాకరమని సీపీఐ నాయకులు హరినాథ్, సురేష్ అన్నారు. మండల కేంద్రమైన గోస్పాడు బస్టాండ్ వద్ద ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టి నివాళులర్పించారు. జోహార్ వీర జవాన్ అని నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గుండ్లపల్లి తండాకు చెందిన మురళీ నాయక్ పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో దేశం కోసం పోరాడుతూ ప్రాణాలు అర్పించి వీర మరణం పొందారన్నారు. ఆయన మరణం తెలుగు ప్రజలకే కాక దేశ ప్రజలందరికి స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పుల్లయ్య, దావీదు, నాగయ్య, హనుమంతు, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక..ఆనంద వేడుక




గురువులతో పూర్వ విద్యార్థులు

రుద్రవరంలోని కన్యకా పరమేశ్వరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002 – 2007 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఇందుకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలే వేదిక అయింది. దాదాపు 18 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చదువు నేర్పిన గురువులను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో కూర్చోబెట్టి గ్రామంలో ఊరేగించారు. తర్వాత పాఠశాలలో వారిని సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడుతో పాఠశాల అభివృద్ధికి అందించాల్సిన సహకారంపై చర్చించారు. – రుద్రవరం

వలస బాట.. మేతకు వేట

- స్థానికంగా గ్రాసం లేక జీవాలతో పయనం
- పచ్చిక మొలవగానే తిరిగి స్వగ్రామాలకు



గోస్పాడు సమీపంలోని పొలాల్లో మేస్తున్న జీవాలు

గోస్పాడు: వేసవి కాలం వచ్చిందంటే చాలు మూగజీవాలకు గ్రాసం కొరత ఏర్పడుతోంది. వాటిని కాపాడుకునేందుకు పోషకులు చంకలో సంచి, చేతిలో కర్ర, నెత్తిన తువ్వాలు వేసుకొని ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు. సాగునీటి వనరులున్న ప్రాంతాల్లోని పొలాల్లో గట్ల మీద పచ్చిగడ్డి ఉంటుంది. అక్కడికి గొర్రెలు, మేకల మందను తీసుకెళ్లి మేపుకుంటున్నారు. ఇందుకు మందలోని జీవాల సంఖ్యను బట్టి సదరు గ్రామానికి పుల్లరి చెల్లిస్తారు. అనంతపురం, కొండనాయిని పల్లె , జూనుంతల, బనగానపల్లె, ప్యాపిలి, డోన్, బూర్గల, బుగ్గానిపల్లె, కొలిమిగుండ్ల తదితర ప్రాంతాల నుంచి వేలాది జీవాలతో కాపరులు గోస్పాడు మండలానికి వలస వచ్చారు. మళ్లీ వర్షాలు పడి గడ్డి మొలకలు రాగానే తిరిగి సొంత ఊర్లకు చేరుకుంటారు. అప్పటిదాకా కుటుంబానికి దూరంగా ఈ ఏరియాలోనే జీవాలను మేపుకుంటూ పొలాల్లోనే నిద్రిస్తారు.

జీవాలు బాగుంటేనే మేము బాగుంటాం



మా గ్రామాలవైపు జీవాలకు ఎండాకాలంలో పూర్తిస్థాయిలో మేత దొరకదు.అందుకే వాటిన తీసుకొని ఇక్కడికి వచ్చాం. అవి బాగుంటే మేము బాగుంటాం. జీవాలే పెంపకమే మా జీవనాధారం. అందుకే వాటికి కంటికి రెప్పలా కాపాడుకుంటాం.

– వెంకటేశ్వర్లు, కొన్నే పల్లె

ఎండ,వాన లెక్క చేయం



ఎక్కడ పడితే అక్కడ జీవాలను ఉంచేందుకు వీలపడదు. వాటికి మేతతో పాటు దప్పిక తీర్చేందుకు ఎక్కడో ఒక చోట కొంతమేరకైనా నీరు ఉండాలి. ఈ రెండు ఈ ప్రాంతంలో ఉన్నాయని జీవాలను తీసుకొచ్చాం. మాకు స్థానికంగా గ్రాసం కొరత ఉంది. జీవాలు మేత ఉంటేనే బతుకుతాయి. అందు కోసం మేము ఎండను, వానను లెక్క చేయకుండా వాటి కోసం ఎందాకైనా వెళ్తాం. – సతీష్, బూర్గల

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలి

నంద్యాల(న్యూటౌన్): రద్దయిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను విజయవాడ వరకు తక్షణమే పునరుద్ధరించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల పట్టణంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ పనుల మీద విజయవాడకు వెళ్లేందుకు రైళ్లు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బనగానపల్లె రోడ్డులోని రైల్వే గేట్‌ను తొలగించి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. డోన్ రైల్వే జంక్షన్‌లో అన్ని ప్లాట్‌ఫారంలు కలుపుతూ వృద్ధులకు, దివ్యాంగులకు ప్రయాణ సౌకర్యార్థం లిఫ్ట్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం నడుపుతునన డెమో రైళ్లలో టాయిలెట్ సౌకర్యం కల్పించాలని మంత్రిని కోరారు.

25న వక్ఫ్ సవరణ చట్టంపై నిరసన

నంద్యాల(వ్యవసాయం): వక్ఫ్ సవరణ చట్టంపై ఈ నెల 25న నంద్యాలలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాదీ తెలిపారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆదేశాల మేరకు ఆ రోజు హ్యూమన్ చైన్ కార్యక్రమం చేపడుతున్నామని, దీనిని విజయవంతం చేయాలని ముస్లిం సంఘాల నాయకులకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని వీసీ కాలనీలో హ్యూమన్ చైన్ కార్యక్రమం నిర్వహణపై డెమో ప్రదర్శించారు.

అమ్మవారికి పల్లకీ సేవ



శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి పూజలు





ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి, అమ్మవారిని మరో చోటుకు తరలిస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ: మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో గంగమ్మ దేవాలయం పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వేద పండితులు పాణ్యం దక్షిణామూర్తి ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంగమ్మ విగ్రహాన్ని గర్భగుడి నుంచి తొలగించి బయటకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వేదపండితుడు మాట్లాడుతూ దేశంలో ఎక్కడైనా గంగమ్మ విగ్రహం నాలుగు భుజాలతో ఉంటుందని, అయితే ఉయ్యాలవాడలోని గంగమ్మ విగ్రహం 8 భుజాలతో ఉంటుందన్నారు. ఆలయ నిర్వాహకులు బోరెడ్డి నర్సిరెడ్డి, రంగమ్మగారి క్రిష్టారెడ్డి, ముసాని శివరామిరెడ్డి, ఖాతా దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

ఆధునిక దంతవైద్యంపై అవగాహన పెంచుకోవాలి



దంత వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

గోస్పాడు: ప్రస్తుతం దంత వైద్యంలో వచ్చిన ఆధునిక పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఆదిత్య సందీప్ అన్నారు. ఐడీఏ రాయలసీమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నంద్యాలలో దంత వైద్యులకు అలైనర్స్ ఆధునిక దంత వైద్యంపై శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ఇండియా–పాకిస్తాన్ యుద్ధంలో అమరులైన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ ఆదిత్య మాట్లాడుతూ ఎత్తు, వంకర పళ్ల సరి చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం దంత వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఐడీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురళీధర్‌రెడ్డి, వైద్యులు కిశోర్‌కుమార్, వరుణ్‌కుమార్, రామచంద్రారెడ్డి, నిరంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మునెప్ప

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం తీవ్రతరం చేయనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మునెప్ప అన్నారు. కేంద్రం తీరును నిరసిస్తూ ఈనెల 20న దేశ వ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ, సీపీఐ, ప్రజా సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశా కార్మికులకు కనీస వేతనం, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు , ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ తదితర డిమాండ్లపై సమ్మె సాగుతుందన్నారు. ఇందులో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రఘురామ్మూర్తి, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, నాయకులు శ్రీనివాసులు, సుంకన్న, రమేష్‌బాబు, బాలకృష్ణ, ప్రసాద్, భాస్కర్, అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు ముడుపు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ముడుపుతో బయలు దేరిన పాలిమేర రెడ్డి కర్నాటి కృష్ణారెడ్డి



ఆకట్టుకున్న వేషధారణ

దొర్నిపాడు: మూలపెద్దమ్మను మహాశక్తిగా డబ్ల్యూ గోవిందిన్నె గ్రామస్తులు కొలుస్తారు. 11 ఏళ్ల తర్వాత జూన్ 8, 9, 10 పెద్దమ్మ దేవర నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు ముడుపు కట్టారు. దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తున్న పాలిమేర రెడ్డి అయిన మాజీ సర్పంచి కర్నాటి కృష్ణారెడ్డి ఇంటి నుంచి ముడుపు తీసుకొని అమ్మవారికి సమర్పించారు. దీంతో గ్రామస్తులంతా వందలాదిగా తరలి వచ్చారు. సాంస్కృతిక నృత్యాలతో డబ్బు వాయిద్యాలతో ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య, మిద్దె చిన్నన్న, కంప మల్ల పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



వాహనదారుడి రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఐ

జూపాడుబంగ్లా: ప్రతి ద్విచక్రవాహన దారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి బైక్‌ను నడపాలని లేకపోతే భారీ జరిమానాలు తప్పవని ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం సాయంత్రం జూపాడుబంగ్లా ఆర్టీసి బస్టాండు సమీపంలో కేజీరోడ్డుపై వెళ్లే వాహనాలను తనిఖీ చేసి జరిమానాలు విధించారు. ఈసందర్భంగా వాహనాల దారులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన నిబంధనలతో మోటారు వాహన చట్టాన్ని అమలు చేస్తోందని, ఈ చట్టాల ప్రకారం నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవర్లు, వాహనాల యజమానులకు భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

భారీ జరిమానాలు : హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే రూ.వెయ్యి, ఇన్సురెన్స్ సర్టిఫికెట్ లేకుండా వాహనాలు నడిపితే మొదటిసారి రూ.2వేలు, రెండోపర్యాయం రూ.4వేల జరిమానా విధించనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. లైసెన్స్‌లేకుండా వాహనం నడిపితే రూ.5వేల జరిమానా విధిస్తామన్నారు. పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుండా వాహనాలు నడిపితే రూ.1,500లు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే మొదటి సారి రూ.1,500లు, రెండోపర్యాయం రూ.10వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



స్వామి,అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



గుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో శ్రీ గణ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం నృసింహ స్వామి జయంతిని పురస్కరించుకుని ఈ ఈ కార్యక్రమం నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా మొదట స్వామి అమ్మవార్ల మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, స్నాపన తిరుమంజన సేవా నిర్వహించారు. తర్వాత పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తర్వాత వేద పండితులు శాస్త్రోక్తంగా పెళ్లి తంతు చేపట్టారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను గ్రామోత్సవం నిర్వహించారు.ఆలయ నిర్వాహకులు మధుసూదన రాయల్, అర్చకులు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరానికి సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో గుట్టకొండ లక్ష్మీనరసింహ్మ స్వామి జయంతి వేడుకలు, ఆలయ నిర్మాణ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు చేశారు. అనంతరం అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తుల సమక్షంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేద మంత్రోచ్చారణలతో జయంతి వేడుకలు నిర్వహించారు.